
# ఎందుకె రాధ ఈసునసూయలు...

- పిశిపాటి పద్మజారాణి

45-55-2
వైజాగ్-16.

ఆ రోజు శనివారం. జీతాలరోజు! మధ్యాహ్నం త్వరగా ఇంటికి వచ్చాడు గోపి! "రాధా, బట్టల షాపుకి వెళదాం... అన్నావుకదా! రెడీనా! త్వరగా భోజనం వడ్డించు" అని సమాధానం కోసం కూడా ఎదురు చూడకుండ గబగబా కాళ్ళు చేతులు కడుక్కోటానికి బాత్‌రూంకి వెళ్ళాడు.

ఆ సరికే అందంగా అలంకరించుకొని ముస్తాబై అతనికై ఎదురుచూస్తోంది రాధ. అతను రాగానే భోజనం వడ్డించి...



"ఏమండి... ఈసారి నేను కంచిపట్టు చీర కొనుక్కుంటానండి. రెండున్నర వేలట, మీరు కూడా చక్కని సఫారీ తీసుకోవాలి మరి. మా అమ్మావాళ్ళిచ్చిన డబ్బులతో... కాదంటేనే వెళదాం" అంది గారంగా.

"నీ మాట ఏది ఎపుడు కాదన్నాను రాధా?" అన్నాడు గోపి నవ్వుతూ...

'ఆ చిలకపచ్చరంగు షిఫాన్‌చీర, అదేరంగు పొడవు చేతుల జాకెట్టు, మెడలో పొడవాటి స్టెప్‌చైన్, చెవులకి అదేరంగు బుట్టలు పెట్టుకొని ఎడమచేతికి టైటాన్ రాగా వాచీ, కుడిచేతికి అరడజను ముత్యాల గాజులు, దోసగింజాకారపు బొట్టుబిళ్ళ, పచ్చని పసుపురంగు

శరీరచ్ఛాయ, మంచి శరీరాకృతి, తమలపాకులాంటి లేత నాజూకు అయిన శరీరం, అన్నీ కలిపి అనిర్వచనీయమైన అందం రాధది.' అనుకున్నాడు గోపి!

వాళ్ళిద్దరికీ పెళ్ళై ఆరునెలలయింది! గోపి ఎలక్ట్రానిక్స్ ఇంజనీరు. ఉద్యోగం వచ్చిన కొత్తల్లో ఎవరిదో పెళ్ళికి వెళ్ళాడు. అక్కడే రాధని మొదటిసారి చూశాడు. అదే తొలిపరిచయం. ఆమెను ఇష్టపడ్డాడు. గోపికి మేనరికం ఉన్నా కాదనుకుని పెద్దల్ని పంపి రాయ బారం జరిపి రాధను తనదాన్ని చేసుకున్నాడు. కొడుకు మాటను తీసెయ్యలేక చెల్లెలికూతుర్ని కాదని రాధతో గోపి వివాహం చేశారు తల్లిదండ్రులు!

★ ★ ★

ఉజ్వల శారీ మందిర్ ముందు స్కూటర్ పార్క్ చేశాడు గోపి! చాలా రద్దీగా ఉంది అక్కడివాతావరణం.

జీతాలరోజు అవ్వటం, శనివారం, పైగా పండుగ రోజు కావటంతో ప్రతి బట్టలషాపు ముందు అదే రద్దీ నెలకొని ఉంది. గోపీ, రాధా ఇద్దరూ బట్టల షాపులోకి దారితీశారు.

సేల్స్‌మెన్ వినయంగా పట్టుచీరల కౌంటర్‌వైపు వాళ్ళను తీసుకువెళ్ళాడు. అసలు గోపికి బట్టలు ఎంపిక అంటే మహాచిరాకు. కాని ఏరికోరి చేసుకున్న భార్య, పైగా అందులో పెళ్ళైనాక మొదటి ఉగాది పండుగ. అందుకే తప్పనిసరై ఓపిగ్గా సేల్స్‌మెన్ చూపే చీరలన్నీ చూడసాగాడు.

'ఈ రంగు ఎలా ఉందండీ? నాకీ రంగు బాగా నప్పుతుందా?' అని భార్య మరీ మరీ అడుగుతుంటే...

"అబ్బా అన్నీ బాగున్నాయి రాధా. నీకు ఏ రంగైనా సరే బావుంటుంది. కాని నీ కళ్ళకి ఏది నచ్చితే అదే తీసుకో" అన్నాడు అసహనంగా...

అప్పటికే ఓ వంద చీరలు పైగా తీసింది రాధ.

ఈలోగా...

"నీకు లెవెండర్ కలర్ బాగా నప్పుతుంది రాధా, పైనుండి చూడూ ఆ పట్టుచీర అన్నమాట!" వెనుక నుండి వినిపించిన మాటలకి ఇద్దరూ వెనక్కితిరిగారు.

"హాయ్ రాజా! నువ్వా? ఏంటి? కలా... నిజమా? ఏం చేస్తున్నావు? ఎక్కడున్నావింత కాలం?" అని చిన్నపిల్లలా అడుగుతున్న భార్యనీ, ఆ రాజా అనబడే వ్యక్తినీ మార్చి మార్చి చూశాడు గోపి.

ఆ సందర్భంలో భర్తకి పరిచయం చెయ్యాలి అన్న విషయాన్ని కూడా తాత్కాలికంగా మరచి అతనితో గలగలా మాట్లాడేస్తోంది రాధ. కానీ అతగాడు వెంటనే గోపీ నుద్దేశించి "నాపేరు రాజశేఖర్! నేనూ రాధా డిగ్రీ దాకా కల్సి చదివాం. తర్వాత తనకి పి.జిలో సీటు రావడం, నేను ఎల్ఐసిలో జాయిన్ అవటం కర్ణాటకలో పోస్టింగ్ రావడంవల్ల ఈ మధ్య కలుసుకోవ డానికి వీలు కాలేదు. క్రిందటి నెల్లోనే ఈ ఊరు ట్రాన్స్‌ఫరైంది నాకు." అని తనని తాను పరిచయం చేసుకున్నాడు.

గోపి కూడా స్నేహపూర్వకంగా రాజాతో కరచాల నం చేశాడు. రాధ గోపిని గమనించకుండా రాజాతో కబుర్లలో పడిపోయింది. రాజా చిరునవ్వుతో వింటు న్నాడు. ఈలోగా చీర సెలక్షన్ అవ్వటం బిల్ పేచేసి ముగ్గురూ బయటకి రావటం జరిగిపోయింది.

"మా ఇల్లు దగ్గరే... కాఫీ తీసుకొని వెళుదురు గాని రండి రాజా!" అన్నాడు గోపి.

కాదు... ముందు ఐస్ క్రీం తినాలి" అని పట్టుప ట్టింది రాధ.

ముగ్గురూ ఐస్‌క్రీం పార్లర్‌లో దూరారు.

"ఏయ్ రాజా! చాలా రోజులకి కనపడ్డావు, సిని మాకి ఎపుడు తీసుకెళతావు?" అంటూ అదీ ఇదీ చనువుగా మాట్లాడేస్తూంటే ఒక పక్క సంతోషంగా ఉన్నా, మరొక పక్కగోపి ఏమనుకుంటున్నాడో అని ఇబ్బందిగా ఫీలయ్యాడు రాజా. అంతా తినటం ముగించి బయటకి వచ్చాక రాధ తన అడ్రస్ ఇచ్చి రాజాని రమ్మని మరీ మరీ చెప్పింది!

"తప్పకుండా వచ్చే ఆదివారం కలుస్తా"నంటూ ఇద్దరి దగ్గరా సెల వు తీసుకున్నాడు రాజా.

★ ★ ★

రాజాగురించి, తన స్కూలు, కాలేజీ రోజుల గురించీ, ఆరోజుల్లో తామెలా ఉండేవారో అన్నీ గోపికి వివరంగా చెప్పింది రాధ ఆ రాత్రి భోజనాల దగ్గర గోపి అన్నీ చిరునవ్వుతో విన్నాడు.

"ఏమండీ! మనం పండక్కి రాజాని భోజనానికి మనింటికి పిలుద్దాం" అంది రాధ.


"తప్పకుండా. స్నేహితుణ్ణి పిలవటానికి పర్మి షన్ కావాలా? పిలు!" అన్నాడు గోపి.

రాధ సంతోషం గా నవ్వేసి భర్తని అల్లుకుపోయింది!

★ ★ ★

"రాధా, ఈ రోజు మా మామయ్య కూతురు సుజాత వస్తోంది! తనకిక్కడ ఏదో ఇంటర్వ్యూ ఉందిట. స్టేషన్‌కి వెళ్తున్నాను, ఇందాక మామయ్య ఆఫీసుకి ఫోన్‌చేసి ఈ విషయం చెప్పాడు. వారం క్రితం లెటర్ వ్రాశాడట. మనకి అందనే లేదు. అయినా ఉత్తరాలూ, టెలిగ్రామ్‌లు సకాలంలో అందటం లేదు. నేవచ్చేసరికి ఏదన్నా టిఫిన్ రెడీగా చేసి ఉంచు నేను వస్తాను." అని ఎంత స్పీడుగా వచ్చాడో అంత స్పీడుగా వెళ్ళిపోయాడు గోపి.

రాధ అంతకు ముందు సుజాతని చూళ్ళేదు. వాళ్ళ పెళ్ళికి ఆ అమ్మాయి ఎంసిఏ చేస్తూ పరీక్షలు రాస్తూండటం వల్ల రాలేకపోయింది.



## అనుమల్లిక్ మోజు

హిందీ చిత్ర సీమలో ప్రస్తుతం మంచి 'గిరాకీ' ఉన్న సంగీత దర్శకుడు అనుమల్లిక్.

చాలా మందిలాగే అనుమల్లిక్‌కి కూడా 'జుట్టు' సమస్య ఉంది. దాదాపు పూర్తిగా ఊడిపోతున్న జుట్టుతో బట్టతల ఆసామీలా తయారయిన అనుమల్లిక్‌కి ఉన్నట్టుండి ఏమయిందో తలపై ఒత్తుగా జుట్టు ఉండాలనే కోరిక కలిగినట్టుంది.

హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకున్నాట్ట.

సినిమాల్లో నటించడానికి ఈ మార్గా?

-మౌర్య.



అందుకే ఆ అమ్మాయిని చూడడం కుదరలేదు రాధకి.

అయితే ఆ అమ్మాయిని గోపికి ఇచ్చి చేద్దామనుకున్నారనీ, గోపి తనని ప్రేమించి ఆ అమ్మాయిని కాదని పెద్దవాళ్ళతో బలవంతంగా రాయబారాలు పంపి తనని చేసుకున్నాడనీ మాత్రం బాగా తెల్సు రాధకి.

★ ★ ★

"ఏయ్, రాధా... ఎందుకలా కూర్చుండిపోయావు? ఏమాలోచిస్తున్నావు? ఈ అమ్మాయి మా మామయ్య కూతురు సుజాత అని అన్నానే, రేపు ఏదో కంప్యూటర్స్‌లో ఇంటర్వ్యూ ఉందని వచ్చింది. సుజా! ఇదిగో మీ అక్క, అదే మా రాధ! ఎలా ఉంది?" అని అడిగాడు.

నీ సెలక్షన్ వండర్‌ఫుల్‌గా ఉంది. చాలా అందంగా ఉంది మా అక్క" అంటూ రాధ వైపు తిరిగి "మా బావ నిన్ను తప్ప చేసుకోను అని ఇంట్లో గోలచేశాడని తెలిసి ఏంటో అనుకున్నాను. గానీ ఇప్పుడర్థం అయ్యిందిలే అక్కా!" అంది సుజాత రాధని చూస్తూ మెచ్చుకోలుగా.

రాధకూడా సుజాతవైపు పరిశీలనగా చూసింది. ఐదు అడుగుల ఎత్తూ, చామనఛాయ రంగుతో సన్నగా ఉండి, కొంచెం కళగానున్న మొహం, కళ్ళజోడు పెట్టుకున్న ఆ పిల్లని చూసి ఆ అమ్మాయిని కాదని తనని ఎందుకు వెంటపడి గోపి చేసుకున్నాడో అర్థమైంది రాధకి.

ఆ రోజంతా ఆ అమ్మాయి "బావా!... బావా!" అంటూ గోపి వెనకాల తిరిగింది. అదేపనిగా కబుర్లు చెప్పింది. రాధకి చాలా విసుగ్గా అన్పించింది ఆమె ధోరణి. గోపి మీద పీకలదాకా కోపం వచ్చింది అయినా తమాయించుకుంది.

★ ★ ★

ఇంటర్వ్యూకి బయలుదేరారు బావా మరదళ్ళు! చుడీదార్ వేసుకొని పైన చున్నీలేకుండా... ఆ ధ్యాస కుడా లేకుండా వళ్ళంతా కదిలిపోయేట్లు నవ్వుతోన్న సుజాతని చూసి అరికాలి మంట నెత్తికెక్కింది రాధకి.

సుజాత ఇవేమి పట్టించుకునే స్థితిలో లేదు! ఇంటర్వ్యూ ముగించుకుని గోపీ ఆగమన్నా చాలా 'పనిఉంది, మరొకసారి వస్తాన'ంటూ, ఆ మధ్యాహ్నం ట్రెయిన్‌కి వెళ్ళిపోయింది.

అమెని ట్రెయిన్ ఎక్కించి ఇంటికి వచ్చాడు గోపి... రాధ భద్రకాళి అవతారం ఎత్తింది. అతను ఇంట్లో అడుగుపెట్టాడో లేదో...

"అసలు ఆమెకు సిగ్గుందా? ఏంటా సరసాలు? అసలు దానిక్కొంచెం అయినా వంటిపైన స్పృహ ఉందా? నేను ఉన్నాను అన్న ఇంగితం ఏమైనా ఉందా మీఇద్దరికీ. అసలు మీరు నన్ను కొంచెం కూడా పట్టించుకున్నా రా? నాకు చాలా కోపంగా ఉంది. నాతో మాట్లాడొద్దు" అంది కోపంగా రాధ. గోపి చాలా చాలా ఆశ్చర్యపోయాడు!

సరిగ్గా వారం క్రితం బట్టలషాపులో రాధ ప్రవర్తనకీ, ఇపుడు సుజాత ప్రవర్తనకీ తనకి తేడా కన్పించక పోయినా,- రాధకి కన్పించింది!

ఆరోజు రాధ తన క్లాస్‌మెట్ రాజశేఖర్‌తో అంత చనువుగా మాట్లాడినా, తనని పట్టించుకోకపోయినా తానేం అనలేదు. అలాంటిది తన స్వంతమరదలు తనతో అదేరకమైన చనువునే ప్రదర్శిస్తే రాధ అంతగా ఎందుకు భగ్గుమందో అర్థంగాక బుర్ర గోక్కున్నాడు. కాస్సేపటికి ఏదో స్ఫురించి- 'ఎందుకే రాధా- ఈసునసూయలు - అందం అందరి ఆనందములే' అంటూ కూనిరాగం తీశాడు మహదానంగా.

★

